క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అంబళ్లు



గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని బీపీ అగ్రహారంలో గంగమ్మ జాతర చాటింపు సందర్భంగా మంగళవారం గంగమ్మ మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అంబళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ.. బీపీ అగ్రహారంలో ఏటా జాతర ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 13, 14 తేదీలలో గంగమ్మ జాతర జరుగుతుందని, 13వ తేదీ పొన్నాలమ్మ అమ్మవారికి పొంగళ్లు, రాత్రి అమ్మవారి కొలుపు, 14వ తేదీ గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారిని నిలుపు, రాత్రి నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు. గంగ జాతర సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అమ్మవారికి సారే అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, కందపు శెట్టి, వెంకట ముని రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులోని తాగునీటి పైపులైన్ లీకేజీకు మంగళవారం సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా మరమ్మతులు చేయించారు. శనివారం 'సాక్షి' దినపత్రికలో 'తాగునీటి పైపులైన్ లీకేజీని అరికట్టండి' శీర్షికతో కథనం ప్రచురితమయింది. దీనిపై స్పందించిన సర్పంచ్ , ఉప సర్పంచ్ పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించి, తాగునీరు లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు.

కార్మికుల కష్టానికి 'ఈ-శ్రమ్' సాయం



ఈ-శ్రమ్ కార్డులతో కార్మికులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని రామసేతు వంతెన వద్ద మంగళవారం న్యాయ వారోత్సవాలు, అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా జడ్జి ఆదేశాల మేరకు పట్టణంలోని రామసేతు వంతెన వద్ద కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ అధికారి రంగనాథ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ పథకం ప్రతి అసంఘటిత కార్మికులకు రక్షణగా నిలుస్తుందన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ ప్రయోజనం చేకూర్చే ఈ-శ్రమ్ కార్డు చాలా ఉపయోగపడుతుందన్నారు. 60 ఏళ్ల తర్వాత పెన్షన్ , అలాగే ప్రమాద బీమా, వైకల్యం ఉంటే ఆర్థిక సాయం వంటి ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, శ్రీరామ్ , పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



వీధులను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట పట్టణంలోని ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ జయచంద్ర తెలిపారు. మంగళవారం సీఐ, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బందితో కలిసి ప్రధాన వీధుల్లో పర్యటించారు. వీధులలో వ్యాపారాలు చేసే వారికి అవగాహన కల్పించారు. రోడ్డును ఆక్రమించుకొని ముందుకు రావడం, బుట్టలు పెట్టుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని వ్యాపారస్తులకు సూచించారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



చిన్నాపట్టు వద్ద బోల్తాపడిన కారు

నాగలాపురం : మండలంలోని చిన్నాపట్టు హైవే , పుత్తూరు–చెన్నై జాతీయ రహదారి పక్కన కారు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెన్నైకి చెందిన కొందరు కైలాసకోనకు వెళ్లి తిరుగు ప్రయాణంలో చెన్నైకి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

గాలీవాన బీభత్సం

ఆలయం వద్ద కురుస్తున్న వర్షం



జలమయమైన నగరి వీధి



ఏర్పేడు : బండివానిపల్లి సమీపంలో కూలిన వృక్షం





ఏర్పేడులో ఓ దుకాణంలోకి వచ్చిన వర్షపు నీరు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో మంగళవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఒక్కసారిగా పిడుగులతో కూడిన వర్షం పడింది. గంటకు పైగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు గాలికి ఎగిరపడ్డాయి.నగరివీధి, పూసలవీధి, పాతబస్టాండు, కొత్తపేట ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై పొంగి పార్లాయి. పలుచోట్ల చెట్లు కొమ్మలు విరిగి పడ్డాయి. కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఏర్పేడులో వడగళ్ల వాన

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడులో మంగళవారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో బండివానిపల్లి సమీపంలో పెద్ద చెట్టు రోడ్డుపై పడింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుతోటల్లో మామిడికాయలు నేలరాలాయి.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ అధికారులు

నారాయణవనం : స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవ పోస్టర్లను టీటీడీ అధికారులు మంగళవారం తిరుపతి జేఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవ పోస్టర్లను జేఈఓ వీరబ్రహ్మం, స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, ఆగమ సలహాదారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరత్న మీడియాతో మాట్లాడుతూ.. ఆలయంలో గోపురాలు, గోడలకు వెళ్ల వేయడం పూర్తయిందని అన్నారు. వేసవి తాపాన్ని అధిగమించడానికి నూలు వస్త్రాలతో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వామి వారి ఊరేగింపు కొనసాగే వీధుల్లో విద్యుత్ దీప అలంకరణలు, దేవతామూర్తుల కటౌట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వామిని దర్శించుకునే భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలతో పాటు చల్లని తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

క్యాన్సర్ వైద్యశిబిరానికి స్పందన



వైద్య పరీక్షలకు హాజరైన జనం

శ్రీకాళహస్తి : పట్టణంలోని పానగల్‌లోని రాస్ మహిళా వాణి కార్యాలయంలో రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుత్తా మునిరత్నంరెడ్డి 4వ వర్ధంతిని పురస్కరించుకుని పొదుపు సంఘాల మహిళల కోసం టాటా ట్రస్టు సహకారంతో ఉచిత క్యాన్సర్ మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా గుత్తా మునిరత్నం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వైద్యశిబిరం ప్రారంభించారు. రక్తపోటు, మధుమేహం, హైపటైటీస్ బి అండ్ సి, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి పరీక్షలను చేశారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కెనరా బ్యాంకు సహాయంతో కొంత మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాస్ సంచాలకులు నాగరాజు, టాటా ట్రస్టు ఆస్పత్రి వైద్యులు వెంకయ్య బాబు, హేమంత్‌కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్, అమరావతి, మహేంద్ర, సంఘం సభ్యులు, క్లస్టర్ లీడర్లు, రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం



పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

నారాయణవనం: వేసవిలో చిన్నపిల్లలు ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి జీవన్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక గ్రంథాలయంలో వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను జూన్ 6 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీషు, ఇంగ్లీషు గ్రామర్, కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, ఆర్ట్, ఇండోర్ క్రీడలలో సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా చిన్న కొట్టాయి ఉత్సవం



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి అమ్మవార్లను ఆలయంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు మండలం పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో మంగళవారం రాస్ మునిరత్నం నాయుడు వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. రాస్ బాలభారతి కార్యక్రమ అధ్యక్షుడు రాజశేఖర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. తిరుపతి వాసన్ ఐకేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అలాగే తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రవంతి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వృద్ధులకు ట్రైసైకిళ్లు, చేతికర్రలు అందజేశారు. కార్యక్రమంలో రాస్ కమిటీ సభ్యుడు వేణుగోపాల్ చౌదరి, సప్తగిరి బ్యాంకు మేనేజర్ భరత్, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ బాలాజీ రెడ్డి పాల్గొన్నారు.

వాటా ఇస్తేనే పనులు!

– కాంట్రాక్టర్‌కు టీడీపీ నేత బెదిరింపులు



ఆగిన మట్టి తవ్వకాలు , వాహనంపై ఉన్న నేషనల్ హైవే స్టిక్కర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తన పరిధిలో ఏ పని చేసిన డబ్బులు ఇచ్చి పనిచేయాలి లేదంటే ఒప్పుకునే పరిస్థితి లేదు అని స్థానిక టీడీపీ నేత నేషనల్ హైవేకి మట్టిని తోలుతున్న టిప్పర్లను అడ్డుకున్న సంఘటన రేణిగుంట మండలంలో చోటుచేసుకుంది. నాయుడుపేట– పూతలపట్టు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా హైవేకి మట్టి తోలేందుకు కాంట్రాక్టర్లు కలెక్టర్ నుంచి అనుమతులు పొందారు. రేణిగుంట మండలం తూకివాకం చెరువులో మంగళవారం మట్టి తవ్వుతుండగా స్థానిక టీడీపీ నేత పనులను అడ్డుకున్నారు. తన పరిధిలో జరిగే ఏ పనికైనా తనకు వాటా ఇవ్వాలని లేని పక్షంలో పనులు జరగనివ్వనని బెదిరించారు. ప్రభుత్వ పని చేస్తున్నామని, కలెక్టర్ అనుమతులు ఉన్నాయని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని , వారి అనుమతులతోనే మట్టిని తవ్వుతున్నామని కాంట్రాక్టర్ ఆ నేతతో వాదించాడు. తన పరిధిలో వారి పెత్తనం ఏమిటి, మీరు తనకు పర్సంటేజ్ ఇవ్వకుండా మట్టి తవ్వేందుకు అనుమతించనని ఆ టీడీపీ నేత తెగేసి చెప్పినట్లు సమాచారం. చేసేదేమీ లేక జరిగిన విషయాన్ని కాంట్రాక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుళ్లగా ఎమ్మెల్యే ఆ నాయకుడిని మందలించి పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

పోలీసులనే తప్పుదోవ పట్టించిన వైనం

కాంట్రాక్టర్‌తో డీల్ కుదరకపోవడంతో మట్టి తవ్వే చెరువు వద్దకు వెళ్లిన ఆ నాయకుడు పోలీసులకు ఫోన్ చేసి మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నేషనల్ హైవే కి తోలుతున్నారని తెలుసుకొని వెనుతిరిగారు. పంచాయతీలో తన మాటే జరగాలని లేదంటే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదనే విధంగా ఆ టీడీపీ నేత వ్యవహార శైలి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిశోరి వికాసంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీ ఏఎస్ఆర్ కాలనీలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బాలికల చేత ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ.. బాలికలు శారీరక, మానసిక జాగ్రత్తలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ.. బాలికలు సెల్ ఫోన్ వినియోగం, సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో అనర్థాలు ఆరోగ్యపరంగా ఎదురయ్యే సమస్యల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధమ్మ, సంఘమిత్ర కిషోర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి బాలికలకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోరి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిశోరి బాలికలు సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోషకాహారం, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు , సైబర్, ఆన్‌లైన్ మోసాలు, ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యమున, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి 2025–26 సంవత్సరానికి నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. వేదాం సమీపంలోని దక్షిణ కాళికామాత ఆలయంలో ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శిగా కార్తీక్ నాయుడు, గౌరవాధ్యక్షుడిగా వై. చంద్రయ్య, పీఆర్వోగా ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఏపీఆర్వోగా చందశేఖర్ , కోశాధికారిగా వినయ్ , ఉపాధ్యక్షులుగా నత్తం హరిబాబు , నాని, వెంకటేష్ , కార్యనిర్వాహక కార్యదర్శిగా ధనశేఖర్ , కార్యదర్శులు బి. రవి , అలీం , జుంలేషా, కాకి హరిబాబు, సంయుక్త కార్యదర్శులుగా బాలచంద్ర , విజయ్ , బాబు తదితరులను ఎన్నుకున్నారు.

పేకాట స్థావరంపై దాడులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీలో గుట్టుచప్పుడు కాకుండా ముళ్లపొదల్లో జరుగుతున్న పేకాటస్థావరంపై మంగళవారం గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తన సిబ్బందితో దాడులు చేశారు. దాడుల్లో అయిదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,460 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు ఎవరు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధాకర్ హెచ్చరించారు.

మునిరత్నం సేవలు స్ఫూర్తిదాయకం



రక్తదానం చేస్తున్న విద్యార్థి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రాష్ట్రీయ సేవా సమితి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మునిరత్నం నాలుగో వర్ధంతి సందర్భంగా రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మంగళవారం స్వచ్ఛంద రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చి రక్తదానం చేశారు. అదే విధంగా కెనరా బ్యాంకు సహకారంతో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల ను పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని ఎస్వీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, ప్రొఫెసర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాస్ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ.. 1981లో రాష్ట్రీయ సేవా సమితిని ఏర్పాటు చేసి 41 ఏళ్ల పాటు నిరాటంకంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిస్సా, ఢిల్లీలో లక్షలాది పేద కుటుంబాలకు సేవ చేసిన ఘనత మునిరత్నంకే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ తారకేశ్వర్, ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్స్ చంద్రయ్య, సుజన్ కుమార్, మేనేజర్ కాళప్ప, మునికుమార్, రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, ట్రస్టీలు సుబ్బ రత్నమ్మ, నిత్య, సుధ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ ఎంటర్ ప్రెన్యూర్‌కు శంకుస్థాపన

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద ప్రభుత్వం నూతన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఏపీ ఎంఎస్ఎంఈ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల డెవలప్‌మెంట్ పాలసీ 4.0 కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఏపీఐఐసీ అధికారులు, టీడీపీ నాయకులు బొల్లినేని జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

8న ప్రజాదర్బార్

సత్యవేడు : పార్టీ నాయకులతో బుధవారం విద్యాశాఖ మంత్రి శాఖమంత్రి నారా లోకేష్ సమావేశమై పార్టీ కార్యక్రమాలపై చర్చించనున్నారు. గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం ఎల్‌జీ కంపెనీ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిసింది.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

శ్రీకాళహస్తి : పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి భవనంలో మంగళవారం శ్రీకాళహస్తి మండలం, ఏర్పేడు మండల అధికారులతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సమీక్షించారు. మండలాల్లో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం

బుచ్చినాయుడుకండ్రిగ : రీ సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్ఎస్‌డీటీ చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మభూపాలపురం గ్రామంలో భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించి, వారి భూముల పాసు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూలోని భూముల రీసర్వేలో ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా చేపట్టాలని కోరారు. పార్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని తిమ్మభూపాలపురం గ్రామరెవెన్యూ పరిధిలోని తిమ్మభూపాలపురం గ్రామంలో 384.98 ఎకరాలు, చల్లమాంబపురం గ్రామంలో 265.55 ఎకరాలు భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. ఇప్పటికే రెండు గ్రామాల సరిహద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేసి, సర్వేను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులు అప్రమత్తం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం మామండూరులోని మామిడి తోటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. శేషాచల అడవిలో పగలంతా ఉండి రాత్రి వేళల్లో సుమారు 10 ఏనుగుల గుంపు మామిడి చెట్లపై పడి ధ్వంసం చేస్తున్నాయి. చేతికొచ్చిన పంట ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు వేడుకుంటున్నారు. ఎన్నడూ లేని విధంగా రైల్వే ట్రాక్ దాటి ఏనుగులు ఊరు వైపు ఈ సంవత్సరం రావడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాత్రి వేళలో రైల్వే ట్రాక్ వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజలు భయభయంగా గడుపుతున్నారు.

ఇసుక లారీ సీజ్

నాగలాపురం : పిచ్చాటూరు మండలం అడవి శంకరాపురం వద్ద నిల్వ ఉంచిన ఇసుకను టిప్పర్ లారీకి లోడింగ్ చేసి చెన్నైకు తరలించేందుకు సిద్ధం చేసిన లారీని ముందస్తు సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి లారీపై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అలాగే లారీకి లోడింగ్ చేసి యంత్రాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఊరేగింపులో అధికారులు, సహాయకులు

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. గర్భాలయాన్ని శుద్ధి చేసి గోడలను సుగంధ ద్రవ్యాలతో లేపనం చేశారు. ఈనెల 11 నుంచి 19 వరకు తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, తిరుచూర్ణంతో కలిపిన మిశ్రమాలను మేళ తాళాలతో ఆలయ అంతర ప్రాకారంలో పరిచారకులు ఊరేగించారు. అనంతరం వెంకన్న ఆలయంతో పాటు పద్మావతీ అమ్మవారు, గోదాదేవి గర్భాలయాలు హోమశాల గోడలకు పూతవేశారు. మధ్యాహ్నం 2 గంటలకు దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాస రాఘవ భట్టాచార్య, నరసింహ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలు పాఠశాలలో చేరిక



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని జంబుగోళం, బంగ్లాతోట, జీఎస్‌కండ్రిగ, ఆర్.అనంతాపురం గ్రామాల్లోని బడి బయట ఉన్న పిల్లలను మంగళవారం ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాఠశాలలో చేర్పించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను తిరిగీ పాఠశాలల్లో చేర్పిస్తున్నామన్నారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.